

Fashion

• సమతా చౌదరి, డిజైనర్
wowobySamathachowdari

## డబుల్ ధమాకా..

క్రాప్‌టాప్.. ఫ్యాషన్‌లో ఎప్పుడూ టాపే. ఇక అది జోడు రంగుల కలనేతలో వస్తే అది డబుల్ ధమాకాలా అదరగొడుతుంది. వక్కరంగు వన్నెల్లో నటి మధుమిత ధరించింది ఆ తరహా క్రాప్‌టాప్ లెహంగానే. మెరిసే శాటిన్ వస్త్రం మీద ఎరుపు రంగు ఎంబ్రాయిడరీ చేసిన ఇది పర్‌ఫెక్ట్ పార్టీ పీస్ అనిపించేలా ఉంది. నడుం పట్టీ మీద వచ్చిన బంగారు రంగు వర్క్ డ్రెస్‌కి ప్రత్యేక లుక్ తీసుకొచ్చింది. ఇక, దీనికి నగలు జోడిస్తే వగల రాణి మీరే అన్నంత అందంగానూ ఉంటుంది.

## సేవ్.. అడయార్!

**తేలికగా** దొరికేది అంటే ఎవరికైనా చులకనే. అందుకు ఉదాహరణ నీరు. నీటి వృథా ఓవైపు, జల కాలుష్యం మరోవైపు.. ఆ అమూల్యమైన వనరును తరిగిపోయేలా చేస్తున్నాయి. ఈ విషయమై ప్రజల్లో అవగాహన కల్పించాలని అనుకున్నారు చెన్నైకి చెందిన పార్వతి నాయర్. ఆమె ఓ కళాకారిణి. దేశంలోనే అత్యుత్తమ విజువల్ ఆర్టిస్ట్‌గా పేరు తెచ్చుకున్నారు. పార్వతి ప్రాణంపోసిన కళాఖండాలు సింగపూర్ నుంచి ఆస్ట్రేలియా వరకు ఎన్నో దేశాల్లో, అనేక మ్యూజియంలలో కనిపిస్తాయి. సామాజిక అంశాల మీద ఎక్కువగా కళాకృతులు రూపొందించే పార్వతి దృష్టి చెన్నైలోని అడయార్ నది మీద పడింది. ఒకప్పుడు అది అరుదైన జీవ వైవిధ్యానికి చిరునామా. సాగులో, తాగులో చెన్నై పరిసర ప్రాంతాలకు అండగా నిలిచిన జీవనది. ఆ అడయార్ ఇప్పుడు మురికికూపంగా మారడం చూసి పార్వతి చలించిపోయారు. అందులో ఎక్కువగా కనిపించే ప్లాస్టిక్ బాటిల్స్, బల్బులు లాంటి వ్యర్థాలతో ఓ కళాకృతిని రూపొందించారు. తన వంతుగా ప్రజలకు ఓ హెచ్చరిక చేశారు. 'నీరు లేకపోతే నాగరికత లేదు. నీరు లేకపోతే మీరూ లేరు' అని సూటిగా చెబుతారామె.







## సక్సెస్.. ఎంతో రుచి రా!

**కొన్ని** ఆసక్తులు అంతే! మనం ఏం చదువుతున్నా, ఎలాంటి కెరీర్‌ను ఎంచుకున్నా.. అడుగులు అటువైపే పడతాయి. మహారాష్ట్రకు చెందిన అదితి దుగార్ ఇందుకు ఉదాహరణ. బాల్యం నుంచీ తనకు వంటలంటే ఇష్టం. బీకామ్ తర్వాత సీఎఫ్‌ఏ చేసి ఫైనాన్స్ రంగంలో ఉద్యోగం చేస్తున్నా కూడా.. ఓ హోటల్ నిర్వహించాలనే ఆసక్తి తగ్గలేదు. సరికదా, ఉద్యోగమే మానేసేంతగా ప్రేరేపించింది. దీంతో ముంబైలో సేజ్ & సాఫ్రాన్ పేరుతో ఓ రెస్టారెంట్ ప్రారంభించారు. ఆ విజయం కూడా ఆమెకు సంతృప్తిని ఇవ్వలేదు. కస్టమర్లకు రుచికరమైన, ఆరోగ్యకరమైన వంటకాలను అందించాలనే తపనతో ఆసియా, ఐరోపా ఖండాలు చుట్టొచ్చారు. పాకశాస్త్రంలో ప్రావీణ్యం సంపాదించారు. 2016లో ముంబైలో మాస్క్ అనే రెస్టారెంట్ ప్రారంభించారు. ఓ జాబితా ప్రకారం ఆసియాలోనే రుచికరమైన రెస్టారెంట్లలో 21వ స్థానంలో ఉందిది. వీటితోపాటుగా 'అరకు కెఫే' లాంటి గొలుసుకట్టు హోటల్స్‌నూ నిర్వహిస్తున్నారు.



డియర్ జిందగీ

## నాన్న రెండో పెళ్లి!

నాకు పన్నెండేండ్లు ఉన్నప్పుడు అమ్మానాన్న విడాకులు తీసుకున్నారు. ఇద్దరూ ఉద్యోగులే. దీంతో ఎవరి బతుకు వారు బతుకుతున్నారు. నేను అమ్మ దగ్గరే ఉంటాను. అప్పుడప్పుడూ నాన్న ఇంటికి వెళ్తుంటాను. ఆయనతో నాకు సత్సంబంధాలు ఉన్నాయి. నన్ను ప్రేమగా చూసుకుంటారు. తరచూ బహుమతులు ఇస్తారు. ఫోన్ చేసి నా యోగక్షేమాలు తెలుసుకుంటారు. చదువు, కెరీర్ విషయంలో సాయం చేశారు. ఓసారి నేను వెళ్లేసరికి నాన్నతో పాటు ఓ మహిళ ఉంది. ముప్పై ఏండ్లు ఉంటాయి. ఆకర్షణీయంగా ఉంది. ఆమెను పరిచయం చేస్తూ 'ఈమె నా స్నేహితురాలు. చాలా కాలం నుంచీ తెలుసు. బాగా చదువుకుంది. తనను పెండ్లి చేసుకునే ఆలోచన ఉంది' అని చెప్పారు. అదొక పెద్ద షాక్. ఈ వయసులో వివాహం ఏమిటి? అందులోనూ తనకంటే ఓ ఇరవై ఏండ్లు చిన్నదైన మహిళతో? అమ్మకు తెలిస్తే ఎలా స్పందిస్తుందో అని భయంగా ఉంది. అసలే తను హార్ట్ పేషెంట్. ఇప్పుడు నేనేం చేయాలి?

• ఓ పాఠకురాలు



**నిజమే.** ఉద్వేగపరంగా చాలా ఇబ్బందికరమైన సందర్భమే. అటు అమ్మ, ఇటు నాన్న. మధ్యలో ఓ మహిళ. ఎటూ తేల్చుకోలేని కూతురు స్థానంలో మీరు. ఒకసారి జరిగిన విషయాలన్నీ ఒక కాగితం మీద రాసుకోండి. మీకు తోచిన పరిష్కారాలతో ఓ చిట్టా తయారు చేసుకోండి. మరొక్క మాట.. ఇప్పటికే మీ నాన్న విడాకులు తీసుకున్నారు. చాలాకాలం నుంచి ఒంటరిగా జీవిస్తున్నారు. వయసులో కొంత వ్యత్యాసం ఉండవచ్చు. కానీ, ఇప్పటికైనా తనకంటూ ఓ తోడు దొరికింది. ఎంతో కొంత సంతోషించాల్సిన విషయమే ఇది. తెగతెంపులు చేసుకున్న భర్తకు మీ అమ్మగారి మనసులో ఇంకా స్థానం ఉందనే అనుకుంటున్నారా? అదే నిజమైతే, ఇద్దర్నీ కలిపే ప్రయత్నం ఎందుకు చేయలేదు. ముందుగా ఆమెతో మాట్లాడండి. సమాజం అంటారా? కొద్దిరోజులు మాట్లాడుకుంటారు, చర్చించుకుంటారు, నవ్వుకుంటారు. ఆ తర్వాత వాళ్లే మరిచిపోతారు.


## పీసీఓఎస్ కోసం ఓ యాప్

**హార్మోన్** అసమతౌల్యం వల్ల ఏర్పడే సమస్య.. పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పీసీవోఎస్). ఈ ఇబ్బంది గురించి ఈమధ్యకాలంలో చాలా వార్తలే వినిపిస్తున్నాయి. అవగాహన కూడా పెరుగుతున్నది. రుతుక్రమంలో మార్పులు, సంతానలేమికి కూడా ఇదొక కారణమని చెబుతున్నారు నిపుణులు. తొలిదశలో లక్షణాల్ని కనిపెట్టడం కష్టం కాబట్టి.. చాలా మంది పెద్దగా పట్టించుకోరు. ఈ మధ్యే ప్రత్యేకమైన క్లినిక్స్ కూడా ఏర్పాటు అవుతున్నాయి. అలాంటిదే చెన్నైకి చెందిన THREOS. ఈ సంస్థ ఓ యాప్‌ను కూడా విడుదల చేసింది. ఈ యాప్ ద్వారా ఆడియో లేదా వీడియో కన్సల్టేషన్ పొందవచ్చు. సంస్థ అందించే వివిధ ఉత్పత్తులను కొనుక్కోవచ్చు. ఇతర సభ్యులతో మన అనుభవాలను పంచుకోవచ్చు. సమస్యను ఎప్పటికప్పుడు గమనించుకునేలా ఓవులేషన్ ట్రాకర్, వ్యాయామాన్ని బేరీజు వేసే యాక్టివిటీ ట్రాకర్ లాంటి ఎన్నో ఫీచర్స్ ఇందులో ఉన్నాయి.



## బాధల్లో.. పెయిన్ డైరీ!

**రోజువారీ** జీవితంలో ఆందోళనలకు గురవుతున్నారా... ఒత్తిడి మీ జీవితాన్ని చిత్తు చేస్తున్నదా... అయితే ఈ డైరీ గురించి తెలుసుకోవాల్సిందే. సాధారణంగా శారీరక ఇబ్బందుల తీవ్రతను తెలుసుకోడానికి వాడే ఈ డైరీ.. మానసికమైన బాధలను కొలిచేందుకు, తద్వారా ఉపశమనం పొందేందుకు కూడా ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. దీర్ఘకాలంగా డిప్రెషన్‌లాంటి సమస్యలతో బాధ పడేవారు, తాము ఏ సందర్భంలో, ఏ సమయంలో ఎక్కువ బాధకు గురవుతున్నారు, ఆ బాధ కలగడానికి కారణమైన అంశాలేంటి, అసలు ఆ రోజు మొత్తంగా మూడ్ ఎలా ఉంది.. ఇలా వివిధ అంశాలను ఈ పెయిన్ డైరీలో పొందుపరచాలి. ఇవాళ సంతోషకరమైన రోజు, బాధాకరమైన రోజు, ఫర్వాలేదు.. ఇలా ప్రతిరోజునూ టిక్ చేయడం వల్ల లేదా వివిధ రంగులను వాడి తమ మూడ్‌ను డైరీలో ప్రతిబింబించడం వల్ల కొద్ది రోజులు గడిచేసరికి అసలు జీవితం ఎలా సాగుతున్నది అనే సమాచారం ఒక చోట దొరుకుతుంది. ఎక్కడ ఇబ్బంది పడుతున్నాం, ఎందుకు ఇబ్బంది పడుతున్నాం, పదేపదే ఒకేపని చేస్తున్నామా... లాంటి విషయాలు తెలుసుకోవడం ద్వారా మనసును ఇబ్బంది పెట్టే వాటిని దూరం పెట్టి, కెరీర్ మీద దృష్టి పెట్టే అవకాశం ఏర్పడుతుంది. తద్వారా మానసికంగా మెరుగుపడవచ్చని చెబుతున్నారు సైకాలజిస్టులు. సాదా నోట్‌బుక్ లేదా ప్రత్యేకమైన డైరీల్లోనూ వీటన్నిటినీ పొందుపరచుకోవచ్చు. మనసును బాధించే నొప్పుల నుంచి బయటపడొచ్చు. మానసికమైనదైనా నొప్పి నొప్పే కదా మరి!





ఆమె పుట్టి పెరిగినదంతా రాజస్థాన్‌లోనే అయినా... హైదరాబాద్‌తో ప్రత్యేక అనుబంధం ఉంది. బీటెక్ కంప్యూటర్ సైన్స్ తర్వాత ఎమ్మెస్‌లో చేరడంతో ఈ మహానగరంతో దోస్తానా మొదలైంది. ట్రిపుల్ ఐటీ-హైదరాబాద్‌లో చదువుతూనే.. వ్యాపార రంగం వైపు అడుగులు వేశారు. డ్రోన్ టెక్నాలజీకి కంప్యూటర్ పరిజ్ఞానాన్ని జోడించి మార్కెట్‌లో శరవేగంగా విస్తరిస్తున్నారు ప్రయూషి మాథుర్.

# వెల్‌డన్.. డ్రోన్‌ప్రెన్యూర్!

స్టార్టప్ స్టోరీస్

**రాజస్థానీ** యువతి ప్రయూషి మాథుర్ అహ్మదాబాద్‌లోని నిర్మా యూనివర్సిటీ నుంచి బీటెక్ చేశారు. అమ్మ, నాన్న.. ఇద్దరూ ఉన్నత విద్యావంతులే. ఐఐటీ కోచింగ్ ఫ్యాక్టరీ కోటాలో పుట్టి పెరిగారు ప్రయూషి. 'బాల్యం నుంచీ నాకంటూ కొన్ని కలలు ఉండేవి. ఉద్యోగమనే చట్రంలో ఇరుక్కుపోవద్దని ముందే నిర్ణయించుకున్నాను. కన్నవాళ్లు కూడా నా కలల్ని అర్థం చేసుకున్నారు. ఎంతో ప్రోత్సహించారు' అంటూ తన నేపథ్యాన్ని వివరిస్తారు ప్రయూషి.

ఇంజినీరింగ్ అనంతరం మాస్టర్స్ కోసం ట్రిపుల్ ఐటీ – హైదరాబాద్‌లో చేరారు. ప్రస్తుతం ఇక్కడే పీహెచ్‌డీ చేస్తున్నారు. మహా నగరం ఐటీ రంగంలో దూసుకుపోతున్న తీరు ఆమెను అబ్బురానికి గురిచేసింది. కేసీఆర్ సర్కారు ఆంత్రప్రెన్యూర్స్‌కు అందించిన ప్రోత్సాహం గొప్పగా అనిపించింది. 'దేశంలో ఓ వంద స్టార్టప్స్ ప్రాణం పోసుకుంటే.. అందులో అరవై వరకూ హైదరాబాద్‌లో పుట్టుకొచ్చినవే. పెద్దపెద్ద కలలతో చిన్నగా అడుగులు వేయడం ప్రారంభించిన ఎంతోమంది స్వాప్నికులు పరిచయం అయ్యారు. ఘన విజయాలు, వైఫల్యాలు ఎక్కడైనా ఉండేవే. వాటిని దాటుకుని ముందుకు వెళ్లడంలోనే మన ప్రతిభ ఉంటుంది' అంటారామె. ఆ గాథలన్నీ విన్నాక, కళ్లారా చూశాక ఆంత్రప్రెన్యూర్‌షిప్ వైపు అడుగులు వేయాలనే నిర్ణయం తీసుకున్నారు. భవిష్యత్తును శాసించగలిగే శక్తి డ్రోన్ టెక్నాలజీకి ఉందని ఆమె భావించారు. అప్పటికే తనకు పట్టున్న కంప్యూటర్ సైన్స్‌ను డ్రోన్ టెక్నాలజీకి జోడిస్తే కనుక.. కొత్తపుంతలు తొక్కించవచ్చనే అభిప్రాయానికి వచ్చారు. 'అజ్నాహక్' (ఐజేఎన్‌హక్) స్థాపనకు అదే కారణమైంది. అందులోనూ, ఇటీవలి కాలంలో డ్రోన్ల వినియోగం పెరిగింది. ప్రతిచోటా పెరుగుతున్న ప్రాధాన్యాన్ని ఓ మార్కెట్ అవకాశంగా మలుచుకోవాలని భావించారు ప్రయూషి. అనుకున్నదే ఆలస్యం, ఆలోచనలకు కార్యరూపం ఇచ్చారు. సరుకుల డెలివరీ నుంచి వ్యవసాయం, రహదారులు, నీటి పారుదల, రక్షణ, రైల్వే, పవనశక్తి, జాగ్రఫికల్ సర్వేల్లోనూ డ్రోన్ల వినియోగానికి ఊతమిచ్చేలా తన కంపెనీని తీర్చిదిద్దారు. అచ్చంగా తనలానే ఆలోచించే కాజల్ సంక్లేచను తన ఆంత్రప్రెన్యూర్‌షిప్ ప్రయాణంలో భాగస్వామిగా చేసుకున్నారు. వన్ ప్లస్ వన్ ఈజ్ ఈక్వల్ టు టూ.. లెక్కలకే పరిమితమైన ఫార్ములా. రెండు ఆలోచనలు కలిస్తే, ఇద్దరి భావాలు ఏకమైతే.. వ్యాపారంలో అద్భుతాలు సాధించవచ్చు. 'అజ్నాహక్' విజయ ప్రస్థానం నిరూపిస్తున్న విషయం ఇది.

### ▪ భవిష్యత్తు అంతా..

**మెరుగైన** ఇంజినీరింగ్ నైపుణ్యాలు, అంతకుమించిన మానవ వనరులు, విస్తరించిన సాంకేతికత డ్రోన్ రంగంలో భారత్ కీలక పాత్ర పోషించేందుకు వీలు కల్పిస్తున్నది. ప్రధానంగా ఐటీ, ఫార్మా, డిఫెన్స్ వంటి రంగాలకు చిరునామాగా మారిన హైదరాబాద్ డ్రోన్ ప్రెన్యూర్స్‌కు ఓ వేదికగా నిలుస్తున్నది. రానున్న రోజుల్లో ఈ రంగంలో మరిన్ని పెట్టుబడులు రానున్నాయని గట్టి నమ్మకంతో చెబుతారామె. అయితే పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా పరిశోధన కూడా జరగాలంటారు.

### వీ హబ్‌తో ప్రారంభం...

మహిళలను ఆంత్రప్రెన్యూర్స్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఏర్పాటైన వీహబ్‌తో ప్రయూషి ప్రయాణం మొదలుపెట్టింది. ఇక్కడ నైపుణ్య శిక్షణ పొందాకే ఆమెకు స్పష్టత వచ్చింది. అజ్నాహక్ స్థాపనకు సరిపడా మనోబలం సమకూరింది. విహంగ వీక్షణం అని ఈ మాటకు అర్థం. 'పోటీలో నిలబడేందుకు అవసరమైన సాంకేతికత, మార్కెటింగ్ నైపుణ్యాలు, కంపెనీ నిర్వహణపై సమగ్ర అవగాహన వీహబ్ వల్లే సాధ్యమైంది' అంటారామె. రాజస్థాన్, తెలంగాణతోపాటు మరిన్ని మెట్రో నగరాలను లక్ష్యంగా చేసుకుని కార్యకలాపాలు సాగిస్తున్నారు. 'స్టార్టప్‌గా ఎదగడంలో.. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఆంత్రప్రెన్యూర్స్‌లో కీలక బాధ్యతలు నిర్వహించే చేతన జైన్ సహకారం మరువలేనిది' అని చెబుతారు ప్రయూషి. అన్నట్టు తను మంచి గాయని కూడా. సంగీతం మీదా పట్టుంది. ఆ పరిజ్ఞానంతోనే పియానో, తబలా మొదలైన వాద్య పరికరాల్ని యాప్ రూపంలో సృష్టించారు. క్యాంపస్ రోజుల్లో అనేక సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 'మీ కలలే మీ జీవితం. ఎవరికోసమో మీ లక్ష్యాల్ని చంపుకోకండి. కాలేజీ రోజుల నుంచే ఆ వైపుగా ప్రయత్నాలు ప్రారంభించండి. ఇప్పుడు ఆంత్రప్రెన్యూర్‌షిప్‌నకు అనువైన వాతావరణం ఉంది' అంటూ యువతను ప్రోత్సహిస్తారు ప్రయూషి.

... కడార్ల కిరణ్



